క్లుప్తంగా

శ్రీకృష్ణుడికి రేపు క్షీరాభిషేకం

పుత్తూరు: తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా మంగళవారం స్థానిక గీతా మందిరంలో శ్రీకృష్ణుడికి భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక ద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయం నుంచి ద్రౌపదీదేవి తరపున భక్తులు పాల కలశాలతో గీతా మందిరానికి ఊరేగింపుగా వెళతారు. అనంతరం కృష్ణస్వామికి అభిషేకం చేయనున్నట్లు తెలిపారు. ధర్మరాజులస్వామి ఆలయంలో మధ్యాహ్నం అన్నదానం చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ లారీ మోహన్ తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



బూచివానత్తంలో ఉచిత వైద్య శిబిరం

విజయపురం : మండలంలోని బూచివానత్తం గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చెన్నై తండియార్ పేట ఎంఎస్ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో సుమారు 90 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ ఆస్పత్రి వైద్యులు, క్యాంప్ ఇన్‌చార్జి నవీన్, నాయకులు వెంకటేశులు, బెన్ని, తమిళ్‌సెల్వి, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నింద్ర: మండల కేంద్రంలో ఆదివారం ఓం శక్తి ఆలయ ధర్మకర్త మండలి ఆధర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. దీనికి ప్రజా సేవ ఉద్యమకారులు, ఆధ్యాత్మిక గురువు అన్బళగన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఓం శక్తి ఆలయ కమిటీ ప్రజలకు సేవ చేయడం గర్వంగా వుందన్నారు. ఎండలు మండుతుంటే స్థానిక బస్టాండ్ వద్ద వేచి వున్న ప్రయాణికులకు తాగునీరు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు మణికంఠన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీలక్ష్మీనారాయణుడి కల్యాణం



సుదర్శన్ కుమార్ దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

గంగాధర నెల్లూరు: వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం స్వామి, అమ్మవార్ల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొల్పి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీనారాయణస్వామి ఉత్సవ మూర్తులను పట్టు వ స్త్రాలు, పూలతో అలంకరించి వేద పండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి చిత్తూరు జిల్లా రిటైర్డ్ వెటర్నరీ జేడీ సుదర్శన్ కుమార్, శారద దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. వారికి ఆలయ నిర్వాహకులు సంప్రదాయం ప్రకారం స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టుకు చెందిన భాగవతారిణి రాజేశ్వరి హరికథా కాలక్షేపం చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, అర్చకులు విష్ణుస్వామి. గోవిందస్వామి ద్వివేది పాల్గొన్నారు.

సంక్షేమాన్ని వివరిద్దాం.. జగనన్నను సీఎం చేసుకుందాం

శ్రీరంగరాజపురం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి జగనన్నను మరొకసారి సీఎంగా చేసుకుందామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మణి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా గ్రామాలకు వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రజలను ఏ విధంగా మోసం చేశారో వివరించాలన్నారు. జన్మభూమి కమిటీల ద్వారా ప్రభుత్వ నిధులను ఎలా దోచుకున్నారో తెలియజేయాలని సూచించారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను గెలిపించుకోవాలని తెలిపారు.

రేపు మహతిలో ఉగాది సంబరాలు

తిరుపతి కల్చరల్: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, సంక్షేమ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం ఉదయం 9.30 గంటలకు మహతి కళాక్షేత్రంలో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో మంగళధ్వని, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థవారి వేద పారాయణం నిర్వహిస్తారు. ఉదయం 10 గంటలకు వేదాంతం విష్ణు భట్టాచార్యులు పంచాగ శ్రవణం చేస్తారు. అనంతరం అష్టావధానం, టీటీడీ ఉద్యోగుల పిల్లలతో తెలుగు వైతాళికుల వేషధారణ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వివిధ పోటీలలో గెలుపొందిన ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేస్తారు. అనంతరం ఉగాది పచ్చడి ప్రసాదం పంపిణీ చేయనున్నారు.

పేద పిల్లలకు విద్యా కానుక

- నాడు-నేడుతో స్కూళ్లలో మెరుగైన వసతులు
- కార్పొరేట్‌కు దీటుగా రాణిస్తున్న పిల్లలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



టీఆర్ పురం హైస్కూల్‌లో విద్యాకానుక పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి (ఫైల్)

పాలసముద్రం : ''పిల్లల చదువుకు పేదరికం అడ్డు కాకూడదు. పిల్లలకు మనం ఇచ్చే తరగని ఆస్తి ఏదైనా ఉంది అంటే అది విద్య మాత్రమే. మీరు పిల్లలను బడికి పంపించండి, మేనమామగా వారి చదువు బాధ్యతను నేను తీసుకుంటాను'' అని చెప్పిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. అన్నట్టుగానే ఆయన అనేక విప్లవాత్మక చర్యలు చేపట్టారు. నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు. కార్పొరేట్‌కు దీటుగా వసతులు కల్పించారు. విద్యా కానుక, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద తదితర పథకాలను అమలుచేశారు. తద్వారా పిల్లల చదువుల భారం తమపై పడకుండా చేయడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లలు బాగా చదువుకోవాలంటే వారికి తగిన వనరులు కల్పించాలి. మంచి వాతావరణం ఉండాలి. తల్లిదండ్రులు ఫీజులు కట్టలేదన్న బాధ ఉండరాదు. పోషకాహారం అందించాలి. పిల్లలకు మంచి విద్యను అందిస్తే వారు ఉన్నత స్థానాలకు చేరుకుని నవ సమాజాన్ని నిర్మిస్తారు. ఈ విషయాలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలలు తెరిచే రోజునే విద్యా సంవత్సరం మొత్తానికి సరిపోయేలా పాఠ్య, నోట్ పుస్తకాలు, డిక్షనరీ, బ్యాగు, బూట్లు, సాక్సులు, బెల్టు, మూడు జతల యూనిఫాం కలిపి జగనన్న విద్యా కానుక కింద అందజేస్తున్నారు. ఇందుకోసం ఒక్కో విద్యార్థిపై రూ.2500లు ఖర్చు చేస్తున్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 425 ఉన్నాయి. వాటిలో 18,974 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారికి జగనన్న విద్యా కానుక కింద రూ.47,43,4000లు ఖర్చు చేస్తున్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పంపిణీ చేశారు. తమపై ఆర్థిక భారం లేకుండా విద్య కానుక అందించడం పట్ల తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం కనబడుతోంది.

విద్యాశాఖ సమాచారం

మండలం	స్కూళ్లు	విద్యార్థులు	ఖర్చు రూ.లక్షల్లో
గంగాధరనెల్లూరు	04	4812	12,030
శ్రీరంగరాజుపురం	64	2837	7,092
కార్వేటినగరం	80	3682	9,205
వెదురుకుప్పం	81	3380	8,450
పెనుమూరు	63	2503	6,257
పాలసముద్రం	33	1760	4,400

ఫీజులు భారం లేదు



నేను, నా తమ్ముడు గతంలో ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకునే వాళ్లం. ఏటా స్కూల్ తెరిచే సమయంలో అమ్మానాన్నలకు రూ.వేలు ఖర్చు అయ్యేవి. ఫీజు కట్టడం భారంగా ఉండేది. జగన్ వచ్చాక ప్రభుత్వం పాఠశాలల్లో మంచి విద్య అందిస్తున్నారు. తల్లిదండ్రులపై ఆర్థిక భారం లేకుండా చేశారు. విద్యా కానుకలు ఎంతో నాణ్యంగా ఉన్నాయి. మా లాంటి పేద విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సహకారం మరువలేనిది.

– అభినయ, 9వ తరగతి, తిరుమలరాజుపురం హైస్కూల్

జగన్ మామయ్యకు రుణపడి ఉంటాం



నేను ఏడో తరగతి వరకు ప్రైవేట్ పాఠశాలలో చదివాను. ప్రభుత్వం పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యతో పాటు మంచి మెనూతో మధ్యాహ్న భోజనం, విద్యా కానుక అందిస్తుండడంతో ఎనిమిదో తరగతిలో ప్రభుత్వ స్కూల్‌లో చేరాను. మాకు విద్యా సంవత్సరానికి సరిపడా పుస్తకాలు, బూట్లు, యూనిఫామ్, డిక్షనరీ, సాక్సులు, బెల్టు అందజేస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం లేకుండా చేశారు. మాలాంటి పేదల చదువులకు సహకరిస్తున్న జగన్ మామయ్యకు రుణపడి ఉంటాం.

– కె.రూప, 10వ తరగతి, తిరుమలరాజుపురం హైస్కూల్

మాలాంటి పేదలందరికీ మేలు



మా అమ్మ కూలి పనులకు వెళ్లి నన్ను చదివిస్తోంది. నేను నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా విద్యా కానుక అందుకుంటున్నాను. ఏటా స్కూల్ తెరిచిన మొదటి రోజునే ఏడాదికి సరిపడా పుస్తకాలు, బూట్లు, సాక్సులు, బెల్టు తదితర ఎనిమిది వస్తువులతో కూడిన కిట్లు ఇస్తున్నారు. మాలాంటి విద్యార్థులకు ఒక్క రుపాయి కూడా భారం లేకుండా ప్రభుత్వమే అన్నీ ఉచితంగా అందించడం ఆనందంగా ఉంది.

– సి.పూజ, 10వ తరగతి, ఎస్ఆర్ఆర్ కండ్రిగ విద్యార్థి

నా ప్రతి అడుగూ ప్రజా సేవ కోసమే



ఓటర్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

- మీ దీవెనలు అందించండి
- జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

వెదురుకుప్పం: సీఎం జగనన్న చెల్లెలుగా నేను వేసే ప్రతి అడుగూ ప్రజా సేవ కోసమేనని, నిరంతరం అందుబాటులో ఉంటాను. నన్ను ఆశీర్వదించండి అని జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కె.కృపాలక్ష్మి తెలిపారు. ఆమె ఆదివారం సాయంత్రం పచ్చికాపల్లం, రెడ్డిరెడ్డి కాలనీ, కొమరగుంట పంచాయతీలోని సద్దికూళ్లపల్లె, సద్దికూళ్లపల్లె ఆదిఆంధ్రవాడ, దామరకుప్పం, కొమరగుంట తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని, చేసిన మంచిని వివరించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. జగనన్న అడుగు జాడల్లో నడుస్తూ అందరికీ సేవ చేయడానికి వచ్చానని, ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆమెకు పచ్చికాపల్లంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బ్రహ్మరథం పట్టారు. జేసీబీల ద్వారా 700 కేజీల పూలు చల్లారు. పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి అభిమానాన్ని చాటుకున్నారు. డప్పు వాయిద్యాలు, కోలాటాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, మాజీ జెడ్పీటీసీ బండి గోవర్దన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఉపాధ్యక్షుడు రామయ్య, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, ఏఎంసీ చైర్మన్ మునస్వామి, ఎంపీటీసీ మునిచంద్రారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, సర్పంచ్‌లు ద్రాక్షాయణి, కుమారి, వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలార్‌ప్రకాష్, ఏఎంసీ చైర్మన్ మునస్వామి, సాంస్కృతిక విభాగం మండల అధ్యక్షుడు రవికుమార్ రెడ్డి, బూత్‌కమిటీ కన్వీనర్ నారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్లు జగదీశ్‌రెడ్డి, సుమతి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు శివాజి, ఢిల్లీ, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, బొజ్జారెడ్డి, నాగరాజు, మురళీ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి


పాలసముద్రం : ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలని ఐకేపీ ఏపీఎం పరీదుమస్తాన్, నగరి డివిజన్ ప్రాజెక్టు రిసోర్స్‌పర్సన్ పుష్ప తెలిపారు. ఆదివారం క్రిష్ణజమ్మాపురం యూనిట్‌లోని గ్రామ సంఘం అధ్యక్షురాలు, కోశాధికారి మునియమ్మ, కవిత, లత ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనర్ ప్రతాప్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన చెరుకు నుంచి తయారు చేసిన బెల్లంను టీటీడీ తీసుకుంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో విత్తనం నుంచి విత్తడం వరకు ద్రవఘన జీవామృతం, కషాయాలతో పండించే వారిపై అవగాహన కల్పించారు. వరిపంటను ఆశించే చిన్నచిన్న తెగుళ్ల నివారణకు పేడ, ఇంగువతో చేసిన ద్రావణం వినియోగించాలని, ఘనజీవాతృతం తయారీ, వాటి వినియోగం, మిత్ర, శత్రు పురుగులపై అవగాహన కల్పించారు.

సత్యమ్మకు ప్రత్యేక పూజలు



కూరగాయలతో అలంకరించిన సత్యమ్మ

పాలసముద్రం : మండలంలోని క్రిష్ణజమ్మాపురం, చెరువుముందరకండ్రిగలో వెలసిన సత్యమ్మకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గ్రామస్తులు అంబలి పోసి పాలు, చందనంతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం వివిధ కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు.



చెరువుముందరకండ్రిగలో అమ్మవారికి అంబలి తీసుకొస్తున్న మహిళలు

తండ్రిబాటలో నడుస్తూ..సేవ చేస్తా



పేదలకు చీరలు, పంచెలు పంపిణీ చేస్తున్న హస్తి భువనేశ్వరి

విజయపురం : నా తండ్రి మాజీ ఎమ్మెల్యే దొమ్మరాజు గోపాల్‌రాజు అడుగుజాడల్లో నడుస్తూ, ప్రజా సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన కుమార్తె హస్తి భువనేశ్వరి అన్నారు. ఆదివారం సూరికాపురం గ్రామంలో తన తండ్రి పసుపుకుంకుమ కోసం ఇచ్చిన ఆస్తిలో ట్రస్టు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గత 20 సంవత్సరాలుగా అనాథ పిల్లల చదువుకోసం ఆర్థిక సాయం, పాఠశాలలో స్మార్ట్ టీవీ, విద్యాసామగ్రిని సాయం చేసినట్లు గుర్తు చేశారు. ఇందులో భాగంగా సూరికాపురంలో సుమారు 500 మందికి అన్నదానం చేసి, చీర పంచెలు పంపిణీ చేశారు. ఆమె వెంట సినీ డైరెక్టర్లు కమల్‌కన్నన్, రమణన్, సేరన్, ఎడిటర్ రమేష్, మదన్‌మోహన్, మహిళా వర్సిటీ మాజీ వీసీ జమునా దువ్వూరి, కెమిస్ట్రీ హెచ్‌వోడీ గుణశేఖర్ రెడ్డి, హస్తి రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పాండురంగస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో భక్తులు

పిచ్చాటూరు: పట్టణంలోని శ్రీధర్మరాజుల స్వామి ఆలయం వద్ద శనివారం అర్ధరాత్రి శ్రీపాండురంగ స్వామి, రుక్మిణీదేవి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలంకరణలు, అరటి తోరణాలు, రంగవల్లులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వేదికపై శ్రీపాండురంగ స్వామి, విఠోభాయి దంపతుల చిత్రపటాన్ని కొలుదీర్చి అందంగా ముస్తాబు చేశారు. అర్ధరాత్రి 12 గంటలకు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం చిన్నారుల పండరిభజన గజ్జపూజ ఆదివారం వేకువజామున 4 గంటల వరకు భక్తిప్రపత్తులతో జరిగింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీగా భక్తజనం తరలి వచ్చారు. చిన్నారులకు పండరి భజన దుస్తులను గ్రామ యువకులు వితరణగా అందజేశారు. పండరి భజన నేర్పిన మాస్టర్‌లు లోకేష్, శివకుమార్, తులసి, శ్రీవాణిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు



మంత్రి రోజా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జీఎన్ కండ్రిగ గ్రామస్తులు

పుత్తూరు: మండల పరిధిలోని కృష్ణసముద్రం పంచాయతీకి చెందిన 20 మంది టీడీపీ యువ నాయకులు సర్పంచ్ దయ, శ్యామ్ ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. రామ్‌ప్రసాద్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన ఎం.సురేష్‌బాబు, జె.నవీన్ కుమార్ మాట్లాడుతూ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు, జగనన్న సైనికురాలిగా పనిచేస్తున్న మంత్రి రోజా పనితీరును మెచ్చి చేరామన్నారు. పార్టీలో చేరిన వారిలో ఢిల్లీబాబు, రామ్‌జీర్, టైసన్, విక్టర్, సూర్య, నవీన్, ప్రేమ్‌రాజ్, మణి, అరుణ్, వెంకటేష్, శివ, కుమార్, రాజేష్, సంపత్, ప్రవీణ్‌కుమార్, అలబర్ట్, విజయ్‌కుమార్, ఆనంద్ బాబు, మహేష్ తదితరులు ఉన్నారు.



రామ్‌ప్రసాద్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ యువత

సీనియర్ నేత మురళి సేవలు మరువలేం



మురళికి నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మురళి సేవలు మరువలేమని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. పుత్తూరు రూరల్ మండలం తడుకు పంచాయతీ జగన్నాథపురం ఎస్టీ కాలనీకి చెందిన మురళి శనివారం సాయంత్రం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకొన్న రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆదివారం గ్రామానికి వెళ్లి మురళి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుని కుటుంబానికి రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పుత్తూరు మండలం గోపాలకృష్ణాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ధనలక్ష్మి ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. రామ్‌ప్రసాద్‌రెడ్డి గ్రామానికి వెళ్లి ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.



ధనలక్ష్మికి నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

సంక్షేమం జగన్‌తోనే సాధ్యం



కావునూరులో ప్రచారం చేస్తున్న నాయకులు

నింద్ర: రాష్ట్రంలో సంక్షేమం కొనసాగాలంటే అది జగనన్నతోనే సాధ్యమని రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, ఎంపీపీ దీప అన్నారు. మండలంలోని కావనూరు పంచాయతీలో ఆదివారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ, వలంటీర్ మళ్లీ ఇంటికి రావాలంటే జగనన్న సీఎం కావాలని స్పష్టం చేశారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను ఏనాడూ నెరవేర్చిన పాపాన పోలేదన్న విషయం అందరూ గుర్తుంచుకోవాలని చెప్పారు. ఎన్నికల సమయంలో మాత్రమే ఈ రాష్ట్రంలో కనిపించే చంద్రబాబు మాయమాటలతో మోసం చేయడానికి వచ్చారని పేర్కొన్నారు. టీడీపీకి ఓటేస్తే అవినీతి, అక్రమాలకు చోటిచ్చినట్లేనని, సంక్షేమ పథకాలన్నీ రద్దు చేసుకున్నట్లేనని తెలియజేశారు. మళ్లీ జన్మభూమి కమిటీలు వస్తాయని, ప్రజలకు పీక్కుతింటాయని గుర్తుచేశారు. కులం, మతం, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. అందరూ కలిసికట్టుగా ఫ్యాను గుర్తుపై ఓటేయాలని కోరారు. నగరి నియోజకవర్గంలో రోజమ్మ ఆధ్వర్యంలో ప్రతి గ్రామం అభివృద్ధి బాట పట్టిందని వివరించారు. ఫ్యాను గుర్తుపై ఓటేసి రోజమ్మను మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శుబా, మండల కన్వీనర్ వేణురాజు, సింగిల్ విండో అధ్యక్షులు మునికృష్ణారెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్య, కో–ఆప్షన్ సభ్యులు అనిల్, ఎంపీటీసీ సభ్యులు విజేష్, బాబురెడ్డి, స్థానిక నాయకులు భూపాల్, చిరంజీవి, బాలసుబ్రమణ్యం, మాజీ ఎంపీటీసీ గోవిందయ్య, సచ్చిన్, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యానుకు ఓటేద్దాం.. సంక్షేమం అందుకుందాం



ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పాలసముద్రం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు ఉంటుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తులసి యాదవ్, జెడ్పీటీసీ అన్బలగన్ తెలిపారు. వారు ఆదివారం నరసింహపురంలో పార్టీ కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి గెలుపుకోసం ప్రచారం చేశారు. తులసి యాదవ్ మాట్లా డుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. కుల, మత రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు యధావిధిగా కొనసాగించాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసుకోవాలన్నారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం చైర్మన్ పోలయ్య, చంద్రశేఖర్ రాజు, షణ్ముగరెడ్డి, రవిరెడ్డి, తిరుమళ, సర్పంచ్ నరసింహరాజు, పయణి, కుట్టి, వరదరాజు, అరుల్, గోపాల్, లక్ష్మణన్, చిన్నపయ్యాన్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు న్యాయం చేశాం.. ఆదరించండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్కే సెల్వమణి

నగరి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని మంత్రి ఆర్కేరోజా భర్త, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి అన్నారు. మున్సిపల్ పరిధిలోని సత్రవాడలో 'మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. దీనికి హాజరైన ఆర్కే సెల్వమణి ప్రతి ఇంటికీ వెళ్లి చేసిన అభివృద్ధిని ప్రత్యక్షంగా చూపే కరపత్రాలను అందించారు. తమది ఉత్తుత్తి హామీలు ఇచ్చే బూటకపు ప్రభుత్వం కాదని చెప్పిన మాటపై నిలబడే ప్రభుత్వమన్నారు. అందుకే ఓటువేసి గెలిపించిన ప్రజలకు తాము ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని చూపడం బాధ్యతగా తీసుకున్నామన్నారు. చేపట్టిన ప్రతి అభివృద్ధి పనిని వారికి చెప్పి మళ్లీ ఆశీర్వదించాలని అడుగుతున్నామన్నారు. ఇదే జగనన్న పాలన గొప్పదనమన్నారు. అందరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి, మళ్లీ మీ ఇంటి బిడ్డ రోజమ్మను గెలిపించాలని కోరారు. మరిన్ని అభివృద్ధి పనులు కావాలంటే మళ్లీ జగనన్న సీఎం కావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు బీఆర్వీ అయ్యప్పన్, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, మురుగ, అయ్యప్ప, జగన్ తదితరులు పాల్గొన్నారు.